క్లుప్తంగా

'చంద్రబాబు పాపం ఊరికే పోదు'



ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసిన వలంటీర్లు

ఏలూరు (టూటౌన్): అవ్వాతాతలకు ఇంటి వద్దే పింఛను అందించే వలంటీర్లను దూరం చేసిన చంద్రబాబు కూటమి మండుటెండలో బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేశారని, ఈ పాపం ఊరికే పోదని రానున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్తే కీలకమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. 44వ డివిజన్‌కు చెందిన ఐదుగురు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి, శుక్రవారం స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆళ్ల నానిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ మళ్లీ జగన్ ప్రభుత్వం ఏర్పడనుందని, అవ్వాతాతలకు, వలంటీర్లకు మంచి రోజులు రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పొలిమేర రామదాసు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోరుతూ ప్రచారం



46వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ స్థానిక 46వ డివిజన్‌లో కార్పొరేటర్ ఆయేషా సుల్తానా రియాజ్, డివిజన్ ఇన్‌చార్జి రియాజ్ ఆలీఖాన్‌లు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలను గెలిపించాలని ఇంటింటా కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మున్ని, దావూద్, గొట్టివాడ శ్రీను, పసుపులేటి శేషు, దినేష్, బొమ్మాలి శ్రీను, రజక సంఘం నాయకులు, అన్వర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర పొందండి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పుట్లగట్లగూడెం, గురవాయిగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా సందర్శించారు. కొనుగోలు ప్రక్రియలను ఆయన పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందజేశారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ద్వారా ధాన్యాన్ని విక్రయించుకుని గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు, ఏఓ కేవీఎస్ పోశారావు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

- పండుగగా మారిన వ్యవసాయం
- ఆర్బీకేలతో రైతులకు మేలు



చొదిమెళ్లలో ప్రభుత్వం నిర్మించిన ఆర్‌బీకే కేంద్రం



చొదిమెళ్ల ఆర్‌బీకే కేంద్రాల్లో ఎరువులు అందుకుంటున్న రైతులు (ఫైల్)

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. విత్తనాలు, ఎరువులను స్వగ్రామాల్లోనే అందజేసింది. వ్యవసాయం పండుగలా మార్చి రైతుల మోముల్లో ఆనందాన్ని నింపింది. ఏలూరు రూరల్ మండలంతో పాటు ఏలూరు నగర ప్రాంతాలైన శనివారపుపేట, వెంకటాపురం, చొదిమెళ్ల, పోణంగి, కొమడవోలు, సత్రంపాడు, తంగెళ్లమూడి గ్రామాల్లో 28 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎరువులు, విత్తనాలు అందించి రైతులకు అండగా నిలిచింది. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించి రైతుల్లో ధైర్యం నింపింది. ఏలూరు రూరల్ మండలంలో 6,223 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులకు ఐదేళ్లలో సుమారు రూ.6 కోట్లు పెట్టుబడి సొమ్ము అందించింది.

ఆర్‌బీకేల్లో సేవలు ఇలా..

- పంట నమోదుతో ఉచిత పంటల బీమాను అమలు చేస్తారు. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించడంతో ఈ క్రాప్ బుకింగ్ అయితే పంటల బీమాకు అర్హత వస్తుంది.
- అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు పంట నష్టంపై సర్వే చేసి రైతులకు నెల రోజుల్లోపే పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటారు.
- వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి డ్రిప్, పశువుల దాణా, గడ్డివిత్తనాలు, తదితర రైతులకు అవసరమైనవి ఆర్బీకే ద్వారానే అందిస్తున్నారు. రైతులకు అవసరమైతే సబ్సిడీ విత్తనాలను కూడా ఆర్బీకే ద్వారా తెప్పిస్తారు.
- పంటలకు మద్దతు ధర లేనప్పుడు కనీస మద్దతు ధరతో ధాన్యంతో పాటు అన్ని రకాల ఉత్పత్తులను ఆర్బీకేలో కొనుగోలు చేస్తారు.
- ఆర్బీకే ఉద్యోగి సెలవుపై వెళ్లినా రైతులకు ఇబ్బంది లేకుండా సెలవు రోజు వలంటీర్‌లకు వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

యంత్రాలు అందించారు



ప్రభుత్వం రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో యంత్రాలు అందించింది. మేం గ్రూప్‌గా ఏర్పడిన వెంటనే ప్రభుత్వం సబ్సిడీతో ట్రాక్టర్ అందించింది. ఈ ట్రాక్టర్ ద్వారా మా పంటచేలు దున్నుకోవడంతో పాటు ఇతర రైతులకు సైతం అద్దెకు ఇచ్చుకునే అవకాశం దక్కింది. ఏ ప్రభుత్వాలైనా రైతులను ఆదుకుంటేనే దేశం బాగు పడుతుంది. గతంలో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సైతం సమస్యలు ఎదుర్కొన్నాం. ఇప్పుడా పరిస్థితి లేదు. – బెజవాడ వెంకన్న, చొదిమెళ్ల

లాభసాటిగా వ్యవసాయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడం వల్ల ఎందరో రైతులకు వ్యవసాయంపై నమ్మకం ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయం నరకం. ఎందరో రైతులు సాగుకోసం దళారుల వద్ద డబ్బులు అప్పు చేయాల్సిన దుస్థితి ఉండేది. విత్తనం కొనాలన్నా, ఎరువులు తెచ్చుకోవాలన్నా మండల కేంద్రాలకు వెళ్లి గంటల తరబడి పడిగాపులు పడాల్సి వచ్చేంది. – బత్తిన విజయకుమార్, చొదిమెళ్ల

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మానవ అక్రమ రవాణా నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. మానవ అక్రమ రవాణా, బాధితులకు పరిహారం, మహిళలకు, పిల్లలకు న్యాయ సహాయం అనే అంశాలపై శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో రత్నప్రసాద్ మాట్లాడారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న మానవ అక్రమ రవాణా సమస్యను అధిగమించేందుకు అధికారులు సమన్వయంతో, బాధ్యతతో విధులు నిర్వహించాలని అన్నారు. బాధితులకు రక్షణ, పునరావాసం కల్పనకు చర్యలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, సీడీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వేణుగోపాలరావు, హ్యూమన్ ట్రాఫికింగ్ అధికారులు క్రాంతిప్రియ, డీసీఆర్‌బీ నుంచి ఏఎస్సైలు సిసిలి, రుక్మందరావు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు డిగ్రీ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏలూరులోని ఓటీపీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్ (సాఫ్ట్‌వేర్) ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకామ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు 14 మందిలో ఆరుగురు ఓటీపీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తూ ప్రతిభ చూపి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరిలో కె.వెంకట కళ్యాణి, జి.తరుణికుమారి, జి.మహాలక్ష్మి, సీహెచ్ స్టీఫెన్ బాబు, సీహెచ్ దేవి, సీహెచ్ ఉమ ఉన్నారని తెలిపారు. ఈ విద్యార్థులు సంస్థ సీఈఓ జి.హరిబాబు ప్రిన్సిపాల్ చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, టీవీఎస్ పద్మావతి, ఎం విజయ కుమార్, ఎం కృష్ణ చైతన్య, ఎస్ పరమేశ, పి.కావ్యశ్రీ, టీవీ దుర్గాప్రసాద్ తదితరులు అభినందించారని తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న యాదవ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా, నగర యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తమ్మిలేరు ఒడ్డున ఆంజనేయ స్వామి గుడివద్ద ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ నేత గూడూరి ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్టాండ్ సమీపంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏటా చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారి బుజ్జి, అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా కోశాధికారి గొర్ల రామారావు, బీసీ నాయకుడు లక్కోజు రాజగోపాలాచారి, నాయకులు బొట్టా అజయ్ కుమార్, ఆకుల గంగాధరరావు, కిలారపు జగదీష్, పిలగల ప్రకాశరావు, చిట్టిబోయిన సాయిబాబు, బోగా రాజేష్, కాళిదాసు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



పాలగూడెంలో అబ్బయ్యచౌదరికి హారతి పడుతున్న మహిళ



పాలగూడెం ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ పాలగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి చూపించామని, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, రైతు భరోసా కేంద్రం, సచివాలయం, ఎస్సీ కమ్యూనిటీ హాలు, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేశామని వివరించారు. గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అబ్బయ్యచౌదరికీ గ్రామ ప్రజలు పువ్వులు చల్లి, హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు ఊదరగొండి చంద్రమౌళి అబ్బయ్యచౌదరికి గజమాల వేశారు. సర్పంచ్ పత్యాల సునీత, పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్‌తో కలిసి అబ్బయ్య చౌదరి వ్యాన్, బైక్‌పై ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. గోఖనేషు, కోటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబు వల్లే పింఛనుదారులకు ఇబ్బందులు



ఏడో డివిజన్‌లో ప్రచారం చేస్తున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కార్పొరేటర్ శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనల వల్లే రెండు నెలలుగా పింఛను తీసుకునేందుకు వృద్ధులు ఇబ్బందులు పడ్డారని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏడో డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి విమర్శించారు. స్థానిక ఏడో డివిజన్‌లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి వారు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పింఛనుదారులను కలిసి రెండు నెలలుగా వలంటీర్లు ద్వారా పెన్షన్ ఇవ్వలేకపోవడానికి గల కారణాలను వివరించారు. వచ్చేది జగన్ ప్రభుత్వమే అని, వచ్చే నెల నుంచి వలంటీర్లు ద్వారా ఇంటి వద్దే పింఛ సొమ్ము అందుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్ కుమార్, ఆళ్ల నానిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొల్లిపర భగవాన్, సైతు కొండ, మేరుగు ప్రేమ్, ఆస్లాం, బూసి ప్రభాకర్, ముమ్మల రాము, తిరుపతి, మరియమ్మ, నాగమణి, సుంకర లక్ష్మి, కోలా లక్ష్మి, మేరుగుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముప్పిడి నియామకంపై హర్షం

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి శ్రీనివాసరావు నియామకంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి ఆయన్ని పూలమాలలతో సత్కరించి శాలువాతో అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కుక్కల ధర్మరాజు, కౌన్సిలర్ నేకూరి కిషోర్, పాములపర్తి శ్రీనివాసరావు, అడబాల రాంబాబు, వీరవెల్లి సోమేశ్వరరావు, కుర్రు రవి పాల్గొన్నారు.

హోం ఓటింగ్ ప్రారంభం

ఏలూరు(మెట్రో): ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏలూరులో శుక్రవారం హోం ఓటింగ్ ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమాన్ని ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం ముక్కంటి ప్రారంభించి ఆయా ప్రాంతాల్లో హోం ఓటింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 85 సంవత్సరాల పైబడిన వారు 70 మంది, దివ్యాంగులు 31 మంది మొత్తం 101 మంది ఓటర్లు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరికి హోం ఓటింగ్ సదుపాయం కల్పించేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సంబంధిత గృహాలను సందర్శించి ఫారం-12డి లో దరఖాస్తు చేసుకున్న వారికి హోం ఓటింగ్ సదుపాయం కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమం మే 4వ తేదీ శనివారం కూడా నిర్వహిస్తామన్నారు. ప్రతి టీంలో పీఓ, ఏపీఓ, మైక్రోఅబ్జర్వర్, ఆర్మ్‌డ్ పోలీస్ గార్డ్, వీడియోగ్రాఫర్‌ను నియమించామని తెలిపారు. కార్యక్రమాన్ని సంబంధిత సెక్టార్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లను పల్లకి వాహనంలో ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. ఆలయ ఆవరణలోని కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చారు. ముందే కల్యాణ మండపంలో విశేషంగా అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు పుష్పాలంకారాలు చేశారు. అర్చకులు, పండితులు నీరాజనాలు సమర్పించి కల్యాణ తంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను భక్తుల గోవింద నామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు.

13న ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల పరిశీలకులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికలకు జిల్లాల్లో చేస్తోన్న ఏర్పాట్లపై శుక్రవారం న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్షించారు. ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నియంత్రించేందుకు, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్, ఎస్పీ రామన్, జిల్లా పోలీసు పరిశీలకులు టి.శ్రీధర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు టి.జోర్డాన్ బూటియా, పి.కీర్తినారాయణ్, మేశ్రమ్ గౌరవ్ మధుకర్, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని 1,744 పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్సా కేంద్రంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతిఓటరూ ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ఓటుహక్కు వినియోగించుకునే దిశగా విస్తృత ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎన్నికల ప్రక్రియపై పీఓ, ఏపీఓలకు శిక్షణ



వీవీ ప్యాట్‌లలో ఎన్నికల గుర్తులు లోడ్ చేయిస్తున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/పెదపాడు : దెందులూరు నియోజకవర్గానికి నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 4,5 తేదీల్లో సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు దెందులూరు ఆర్వో, జేసీ బి. లావణ్యవేణి తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సీఆర్‌ఆర్ మహిళా కళాశాల పీజీ బ్లాక్‌లో ఈనెల 4,5 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది, పీవో, ఏపీవోలు, సహాయ పోలింగ్ సిబ్బంది, పోలీస్ డిపార్ట్‌మెంట్, అత్యవసర సర్వీసు సిబ్బంది, సదరు అవకాశాన్ని వినియోగించుకొని పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలన్నారు. శుక్రవారం సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో భద్రపరిచిన వీవీప్యాట్‌లలో బెల్ కంపెనీ ఇంజనీర్ల సహాయంతో దెందులూరు నియోజకవర్గం, ఏలూరు పార్లమెంటుకు పోటీచేస్తున్న అభ్యర్థుల గుర్తుల లోడింగ్ ప్రక్రియ అభ్యర్థుల సమక్షంలో చేశామని తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	94
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	32	ములక్కాడలు	04-06
బెండకాయలు	24	కంద	64
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	40
కాకర కాయలు	34-40	కీరా దోస	34
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	160
బీరకాయలు (పందిరి)	44	అల్లం	170
క్యాబేజీ	34	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-50	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు -తిరుపతి	16.00	4830	32